క్లుప్తంగా

దుకాణాల్లో తనిఖీలు



షాపులో తనిఖీలు చేపడుతున్న కమిషనర్, తదితరులు

నెల్లిమర్ల: పట్టణంలోని మొయిద జంక్షన్‌లో గల దుకాణాలను నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిషేధిత పాలిథిన్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత దుకాణ యజమానులకు అపరాధ రుసుం విధించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, పట్టణ పరిధిలో ఎవరైనా పాలిథిన్, ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

భోగాపురం: మండల కేంద్రంలోని సుందరపేట జంక్షన్ వద్ద ఎస్సై కృష్ణమూర్తి సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో నాతవలస చంపావతి నది నుంచి భోగాపురం వైపు ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను గుర్తించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసకున్నట్లు పోలీసులు తెలిపారు.

28న వేలంపాట

నెల్లిమర్ల: నగర పంచాయతీలో 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశీళ్ల వసూలు వేలంపాట ఈ నెల 28న నిర్వహిస్తామని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు మార్జిన్ ఆశీళ్ల వసూలుకు వేలంపాట గురువారం నిర్వహించగా ఒక్కరు మాత్రమే పాల్గొన్నందున పాట వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 28 ఉదయం 11 గంటలకు నగర పంచాయతీ కార్యాలయంలో తిరిగి వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వివరాల కోసం పని వేళల్లో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

27న ద్విచక్ర వాహనం వేలం

నెల్లిమర్ల: ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం సీజ్ చేసిన టీవీఎస్ మోపెడ్‌ను ఈ నెల 27న వేలం వేయనున్నట్లు ఎస్సై పి. నారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఒకటో పోలీస్‌స్టేషన్‌లో వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు మోడల్ స్కూల్ విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు అయ్యప్పనగర్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సానా ఫర్వీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరాడ పృథ్వీశివకుమార్, జి. యశ్వంత్, బి. సత్యశ్రీ, ఎస్. కృతి, ఎం. నిఖిల్ శ్రీకర్, జి. ఆదిప్రమీల ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ముత్తుస్వామికి ఘన నివాళులు



ముత్తుస్వామి దీక్షితార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అకాడమీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: పట్టణంలోని దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో ముత్తుస్వామి దీక్షితార్ 248వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అకాడమీ అధ్యక్షుడు ఉసిరకల చంద్రశేఖరరావు, కోశాధికారి చిన వీరభద్రరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, తదితరులు ముత్తుస్వామి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించి, ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు డాక్టర్ పద్మప్రియ, హారిక శివరాం, ఎంవీ కామేశ్వరరావు, కాళ్ల నిర్మల, భానుహర్ష, మహేశ్వరరావు, రవికుమార్ సారథ్యంలో వీణ, వయోలిన్, వేణువు, మృదంగం, తదితర గాత్ర వాయిద్యాలతో శంకరాభరణ రాగంలో కృతులను ఆలపించారు. సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌తో ఉపాధి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు

విజయనగరం అర్బన్: డిగ్రీ విద్యలో నూతనంగా అమల్లోకి వచ్చిన ఇంటర్న్‌షిప్‌తో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు తెలిపారు. స్థానిక మహారాజా కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సర ఎంపీసీ విద్యార్థులకు కళాశాల ఫిజికల్ సైన్స్ విభాగం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం డిపార్ట్‌మెంట్ సంయుక్త నిర్వహణలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఇంటర్న్‌షిప్ ద్వారా నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ఫిజిక్స్ విభాగాధిపతి పీఎస్ఎన్ రావు నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి నోడల్ కోఆర్డినేటర్‌గా వి.బాబ్జి, మెంటర్‌గా డాక్టర్ బి.గౌరీశంకరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జి.ఆనంద్, వీవీ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులు భేష్

- రూ. 5.20 కోట్లతో నాలుగు తారురోడ్ల నిర్మాణం



రూ. 8 కోట్లతో నిర్మించిన బద్దుకొండపేట- కొత్తూరు రోడ్డు

విజయనగరం రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోంది. ఇప్పటికే సచివాలయాలు, రైతుభరోసా కేంద్ర భవనాల నిర్మాణాలు పూర్తి చేయగా, వెల్‌నెస్ కేంద్రాలు నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటితో పాటు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం గ్రామీణ రహదారులపై చిన్నచూపు చూడడంతో పాడైన రహదారులపై ప్రజలు ఏళ్ల తరబడి రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడ్డారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న విజయనగరం మండలంలో అనేక గ్రామాలకు కలుపుతూ సుమారు 14 కిలోమీటర్ల మేర నాలుగు రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కృషితో నిధులు మంజూరయ్యాయి. రూ. 5.20 కోట్లు మంజూరవడంతో తారు రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఇక్కట్లు తీరాయి..

మండలంలోని బద్దుకొండపేట రోడ్డు పాడైనా గత ప్రభుత్వం మరమ్మతులకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో పెద్ద పెద్ద గోతుల మీదుగా ప్రజలు రాకపోకలు సాగించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బదుకొండపేట గ్రామం నుంచి కోరుకొండ పంచాయతీ కొత్తూరు వరకు 8.7 కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. దీంతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పూర్తి చేశారు. అలాగే కోరుకొండపాలెం గ్రామం నుంచి గంట్యాడ మండలం పేదవేమలి జంక్షన్ వరకు 2.5 కిలోమీటర్ల తారురోడ్డు మరమ్మతులకు రూ. 35 లక్షల నిధులు మంజూరు చేయగా రోడ్డును అభివృద్ధి చేశారు. సారిక గ్రామం నుంచి రైల్వే గేట్ వరకు 0.8 కిలోమీటర్ల వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షలను మంజూరు కాగా, ఈ రోడ్డు పనులు కూడా పూర్తి చేశారు. మండలంలోని రాకోడు నుంచి పినవేమలి రోడ్డు జంక్షన్ వరకు సుమారు 1.8 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ. 25 లక్షల నిధులను మంజూరు చేయగా దాదాపు 90 శాతం రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణాలు పూర్తి కావడంతో ఆయా గ్రామాల ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోరాడపేట వద్ద నిర్మించిన రోడ్డు



రూ. 35 లక్షలతో మరమ్మతులు చేపట్టిన కోరుకొండపాలెం రోడ్డు

ఏళ్ల నాటి సమస్య తీరింది

ఎన్నో ఏళ్లుగా గోతులతో నిండిన రోడ్డుపై రాకపోకలు సాగించాం. ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో ప్రయాణ కష్టాలు తీరాయి.

– సారిక సత్యనారాయణ, సర్పంచ్, బద్దుకొండపేట

నీరే జీవనాధారం..



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఫ్‌టీసీ అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ త్రినాథస్వామి

- ఎఫ్‌టీసీ అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ త్రినాథస్వామి

డెంకాడ:

నీరు జీవనధారమని ఎఫ్‌టీసీ అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ (శ్రీకాకుళం) కె.త్రినాథస్వామి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'మార్పును వేగవంతం చేయండి' అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన త్రినాథస్వామి మాట్లాడుతూ, జీవరాశులతో పాటు పంటలకు నీరే ప్రధానమన్నారు. నీటిని సరైన పద్ధతిలో వృథా కాకుండా వినియోగించి భూగర్భ జలాలను పెంచాలని సూచించారు. మినుములు, తృణధాన్యాలను తక్కువ నీటితో పండించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో మినుములు తప్పనిసరిగా తీసుకుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ, 2024 సంవత్సరం నాటికి అన్ని గ్రామాల్లోని ఇళ్లకు కుళాయి కనెక్షన్లు అందించేందుకు పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.రఘువీరా, వైస్ ప్రిన్సిపాల్ పి.రంగరాజు, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.షణ్ముఖరావు, హెచ్ఓడీ పి.మార్కండేయరాజు, అధ్యాపకులు ఎస్.చంద్రమౌళి, సీహెచ్‌వీ రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న పదో తరగతి ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాల బండిల్స్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ రమణమూర్తి, తదితరులు

భోగాపురం:

వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభంకానున్న 10వ తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను విజయనగరం స్ట్రాంగ్‌రూమ్ నుంచి రూట్ ఆఫీసర్లు నాగకుమార్, బాబులాల్ శుక్రవారం భోగాపురం తీసుకువచ్చి ఎంఈఓ రమణమూర్తి ఆధ్వర్యంలో ఆయా పరీక్ష కేంద్రాలకు సంబంధించిన ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, మండలంలో 986 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. వీరికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చంద్రా విద్యానికేతన్, మోడల్ స్కూల్‌తో పాటు రావాడ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఆరు ఫస్ట్ సెట్ పేపర్లు మండలానికి చేరుకున్నాయని, రెండో సెట్ పేపర్లు శనివారానికి వస్తాయని తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని సీడీపీఓ జి. ప్రసన్న అన్నారు. శుక్రవారం స్థానిక వీటీ అగ్రహారం బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఏటా రెండుసార్లు పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యాన్ని అందరు వినియోగించుకోవాలన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వంటలు తినడం ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సత్యవతి, సూపర్‌వైజర్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం



గొలగాం నుంచి ర్యాలీగా వస్తున్న మోడల్‌స్కూల్ విద్యార్థినులు

డెంకాడ: బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని డైట్ లెక్చరర్ రవికుమార్ అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీలోని గొల్లపేట మోడల్‌స్కూల్‌లో బాలికా సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అంతకు ముందు విద్యార్థినులతో గొలగాం నుంచి పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ రవికుమార్

ప్రజా భాగస్వామ్యంతో క్షయ నివారణ



పూసపాటిరేగలో క్షయవ్యాధి నియంత్రణ అవగాహన ర్యాలీ

- డాక్టర్ రాజేష్‌వర్మ

పూసపాటిరేగ:

క్షయవ్యాధి నియంత్రణలో ప్రజా భాగస్వామ్యం అవసరమని, అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా సంపూర్ణంగా నియంత్రించవచ్చునని వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి రాజావీధి, బూడివీధి, జాతీయరహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లైతే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వైద్యుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వేదమణి, గణపతి, ఆర్‌పీ రమణ, గణపతి, వర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

డెంకాడ: మండలంలోని ఊడుకులపేటలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేయి చేయి కలుపుదాం.. రాహుల్‌ను ప్రధానిని చేద్దాం అన్న నినాదంతో ఇంటింటికీ వెళ్లి ప్రచారపత్రాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరిబాబు, గోపి, అప్పలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ విజయ్‌నాథ్

డెంకాడ: విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవరుచుకోవాలని భోగాపురం సీఐ విజయ్‌నాథ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లరి చిల్లర పనుల వల్ల జీవితం గాడితప్పే ప్రమాదం ఉందని తెలిపారు. ఎంతో విలువైన జీవితాన్ని తాత్కాలిక చెడు ఆనందాల కోసం నాశనం చేసుకోరాదని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మహేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వాహనాలకు డిమాండ్



మాట్లాడుతున్న సెంచూరియన్ వీసీ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: రాబోయే రోజుల్లో ఈ వాహనాలకు మంచి డిమాండ్ ఉంటుందని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడుతూ, రాబోయే తరం ఎలక్ట్రికల్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయం ఎలక్ట్రికల్ వాహనాలేనని అభిప్రాయపడ్డారు. శ్రావణ్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి సాంబశివరావు మాట్లాడుతూ, సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలని, రోజుకి 16 గంటలు పనిచేసేతత్వం అలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, వర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ మౌనికకు అభినందనలు



అవార్డు స్వీకరిస్తున్న మౌనిక

విజయనగరం రూరల్: ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ పరిధిలోని కొండకరకాం వెల్‌నెస్ కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్న మౌనికకు ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించడంపై రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. జిల్లా కేంద్రంలోని సంతపేట అర్బన్ హెల్త్‌సెంటర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డీటీసీఓ రామేశ్వరి, క్షయవ్యాధి నివారణ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ వీఎస్ ప్రసాద్ చేతుల మీదుగా మౌనిక అవార్డు అందుకున్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



సతివాడలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ పూర్ణిమ, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ఇటీవల మండలంలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న పంటను ఏఓ పూర్ణిమ, తదితరులు శుక్రవారం పరిశీలించారు. అలుగోలు, సతివాడ, గుషిణి గ్రామాల్లో రైతులతో కలిసి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా మొత్తం 360 ఎకరాల్లో మొక్క జొన్న పంట నష్టపోయినట్లు అంచనా వేశామన్నారు. 35 శాతం కన్నా ఎక్కువ నష్టం వాటిల్లిన పంట వివరాలు సిద్ధం చేయాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించినట్లు చెప్పారు. తడిచిన మొక్కజొన్న కంకిలోకి శిలీంద్రాలు రాకుండా ప్రొపికొనజోల్ 5 మిల్లీలీటర్లు లేదా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా రహదారి విస్తరణ పనులు



నెల్లిమర్ల - సతివాడ రహదారిలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులు

- తీరనున్న ప్రయాణికుల కష్టాలు
- రెండు జిల్లాల వాసులకు ప్రయోజనం

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారిలో సతివాడ నుంచి నెల్లిమర్ల వరకు రహదారి విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే టొంపలపేట మినహా అన్ని ప్రాంతాల్లోనూ కల్వర్టుల నిర్మాణాలు పూర్తి కావడంతో ప్రస్తుతం రహదారిని వెడల్పు చేసే పనిలో అధికారులు నిమఘ్నమయ్యారు. ముందుగా తమ్మాపురం జంక్షన్ నుంచి రామతీర్థం వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. సుమారు 10 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరించడానికి ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలను కలిపే రహదారి కావడంతో నిత్యం ఈ మార్గంలో వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి చిన్నది కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడడమే కాకుండా తరుచూ ప్రమాదాలు జరిగేవి. వాస్తవానికి 2016 లోనే రహదారిని స్టేట్ హైవేగా ఆర్‌అండ్‌బీ అధికారులు అప్‌గ్రేడ్ చేసినప్పటికీ రహదారి విస్తరణకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.